సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 19 । అక్టోబర్ । 2023



ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం

ఖరీఫ్‌లో పండిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు.

IIలో ▸



టెలీ కన్సల్టేషన్ సేవలు

టెలీ కన్సల్టేషన్ ద్వారా ఆరోగ్య సలహాలు అందించేలా ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఏర్పాట్లు చేసినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు.

IIలో ▸



14 నుంచి హనుమాన్ దీక్షలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో వచ్చేనెల 14 నుంచి మండల దీక్షలు, డిసెంబర్ 1 నుంచి అర్ధ మండల దీక్షలు ప్రారంభం కానున్నాయి.

న్యూస్‌రీల్

వేగంగా రీ సర్వే



సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంలో పైలెట్ ప్రాజెక్టుగా భూ రీసర్వే కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్న భూసర్వే పనులను జేసీ రామసుందర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. పట్టణంలోని 35 వార్డుల పరిధిలో సర్వే పనులు చేపట్టామని, ఇప్పటివరకు సుమారు 6 వేల నోటీసులు అందించామని కలెక్టర్ అన్నారు. రీసర్వేను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

భీమవరం(ప్రకాశం చౌక్): దసరాను పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నుంచి రెగ్యులర్ సర్వీసులతో పాటు 35 ప్రత్యేక బస్సులు నడుపుతారని, భీమవరం నుంచి 8, నరసాపురం నుంచి 6, తాడేపల్లిగూడెం నుంచి 11, తణుకు నుంచి 11 ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామన్నారు. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు. బుధవారం నుంచి 21 వరకు హైదరాబాద్ నుంచి జిల్లాకు, 24 నుంచి 29 వరకు జిల్లా నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక సర్వీసులు నడుపుతామని, రానూపోనూ టికెట్ తీసుకుంటే రాయితీ ఇస్తామన్నారు.

చేదోడు వాదోడుగా..

వృత్తిదారులకు ఆర్థిక భరోసా

- ఏటా రూ.10 వేల సాయం
- నేడు నాల్గో విడత లబ్ధి అందజేత
- నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు లబ్ధి
- ఉమ్మడి జిల్లాలో 26,184 మంది లబ్ధిదారులు



భీమవరంలో టైలరింగ్ పనిచేస్తున్న దర్జీలు

భీమవరం(ప్రకాశం చౌక్)/ ఏలూరు (టూటౌన్): చేతి వృత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో రజక, నాయీబ్రాహ్మణ, టైలర్లకు ఏడాదికి రూ.10 వేల చొప్పున వైఎస్సార్ చేదోడు పథకం కింద అందిస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే మూడు విడతల సాయం అందించగా గురువారం నాలుగో విడత లబ్ధి అందించనున్నారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీట నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ములు జమచేయనున్నారు. దీనిపై ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నాయీబ్రాహ్మణ, రజక, టైలరింగ్ వృత్తిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమగోదావరిలో.. నాలుగో విడతలో పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 9,698 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. నియోజకవర్గాల వారీగా ఆచంటలో 1,152 మందికి రూ.1.15 కోట్లు, భీమవరంలో 1,201 మందికి రూ.1.20 కోట్లు, నరసాపురంలో 835 మందికి రూ.0.84 కోట్లు, పాలకొల్లులో 1,155 మందికి రూ.1.16 కోట్లు, తాడేపల్లిగూడెంలో 1,823 మందికి రూ.1.82 కోట్లు, తణుకులో 1,945 మందికి రూ.1.95 కోట్లు, ఉండిలో 1,190 మందికి రూ.1.19 కోట్లు, గణపవరం మండలంలో 397 మందికి రూ.39.70 లక్షల లబ్ధి చేకూర్చనున్నారు.

జగనన్న చేదోడు లబ్ధిదారులు

జిల్లా	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
ఏలూరు	16,486	16.49
పశ్చిమగోదావరి	9,698	9.70

ఏలూరు జిల్లాలో..

ఏలూరు జిల్లాలో 16,486 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. నియోజకవర్గాల వారీగా.. చింతలపూడిలో 2,258 మందికి రూ.2.26 కోట్లు, దెందులూరులో 2,343 మందికి రూ.2.34 కోట్లు, ఏలూరులో 2,377 మందికి రూ.2.38 కోట్లు, కైకలూరులో 1,159 మందికి రూ.1.16 కోట్లు, నూజివీడులో 3,303 మందికి రూ.3.30 కోట్లు, పోలవరంలో 3,683 మందికి రూ.3.68 కోట్లు, ఉంగుటూరులో 1,363 మందికి రూ.1.36 కోట్ల లబ్ధి చేకూర్చనున్నారు.

చాలా ఉపయోగం



సీఎం జగన్ ఇచ్చిన హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తూ టైలర్లకు ఏడాదికి రూ.10 వేలు క్రమం తప్పకుండా ఇవ్వడం అభినందనీయం. ఈ సాయం పేద, మధ్యతరగతి వృత్తిదారులకు చాలా ఉపయోగపడుతుంది. షాపుల అద్దెకు లేదా సామగ్రి ఖర్చులకు ఉపయోగించుకుంటున్నాం. టైలర్స్ అసోసియేషన్ తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– కె.రామకోటేశ్వరరావు, జిల్లా టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

రూ.30 వేలు అందుకున్నా..



జగనన్న చేదోడు పథకం ద్వారా నేను ఇప్పటివరకు రూ.30 వేలు సాయం పొందాను. ఈ ఏడాది నాలుగో విడత మరో రూ.10 వేలు అందుకోనున్నాను. ఈ మొత్తం షాపు నిర్వహణ ఖర్చులకు ఉపయోగించుకుంటున్నా. అద్దె షాపులు ఉన్న వృత్తిదారులకు ఆర్థిక భరోసా కలుగుతోంది. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– తాతపూడి శివ గణేష్, నాయీబ్రాహ్మణుడు, నవుడూరు

నేటి నుంచి స్కిల్ టెస్టులు

ఏలూరు (టూటౌన్): భవితా సెంటర్‌లో సీడబ్ల్యూఎస్ఎన్ రిసోర్స్ పర్సన్ పోస్టుల భర్తీలో భాగంగా గురు, శుక్రవారాల్లో ఏలూరు డీఈఓ కార్యాలయంలో స్కిల్ టెస్టులు నిర్వహించనున్నారు.

మొబైల్ షాపు యజమానిపై చీటింగ్ కేసు

జంగారెడ్డిగూడెం: భారతీ ఎయిటెల్ లిమిటెడ్ చీఫ్ నోడల్ అధికారి వి.వెంకట నారాయణన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జంగారెడ్డిగూడెం వాసవీ మొబైల్స్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.మల్లికార్జునరెడ్డి చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. జంగారెడ్డిగూడెంలో వాసవీమొబైల్స్ యజమాని ఒక వ్యక్తికి చెందిన ఆధార్ కార్డును ఉపయోగించి, వేర్వేరు పేర్లతో, వివరాలు మార్చుతూ ఒకే వ్యక్తి ఫొటోతో సదరు వ్యక్తికి తెలియకుండా ఎయిర్‌టెల్ మొబైల్ కనెక్షన్లు తీసుకుని భారతీ ఎయిటెల్ లిమిటెడ్ కంపెనీని మోసం చేశాడన్నారు. సదరు మోసాన్ని, ఫోర్జరీని గుర్తించిన వెంకట నారాయణన్ తప్పుడు కనెక్షన్లను నిలిపివేసినట్లు చెప్పారు. ఈ మేరకు నారాయణన్ ఇచ్చిన ఫిర్యాదుతో వాసవీ మొబైల్స్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ
- ఎల్.అగ్రహారంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్‌లో పండిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఎల్.అగ్రహారం గ్రామంలోని ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సాయంత్రం కలెక్టర్ పి.ప్రశాంతి ప్రారంభించగా, ధాన్యం కొనుగోళ్లను కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా తాడేపల్లిగూడెం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం పరిపాటిగా వస్తోందన్నారు. ఇక్కడి రైతులు భూగర్భ జలాలపై ఆధారపడి ముందుగానే పంట పండిస్తుంటారన్నారు. దీంతో ముందుగానే కోతలు వస్తుంటాయన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ స్థాయి కంటే తక్కువగా వర్షాలు పడ్డాయన్నారు. అయితే 40 నుంచి 50 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయన్నారు. గత సీజన్‌తో పోల్చుకుంటే ఈ సీజన్‌లో కేంద్రం రూ.168 అదనంగా ధర పెంచిందన్నారు. దీంతో 75 కిలోల బస్తాకు రూ.1652 ధర లభిస్తుందన్నారు. గత చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ఏనాడూ రైతులకు సకాలంలో సొమ్ములు చెల్లించలేదని దుయ్యబట్టారు. 2019లో రైతులకు చెల్లించాల్సిన రూ.1800 కోట్లను పసుపు కుంకుమ పేరిట డ్వాక్రా మహిళలకు చెల్లించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లోనే రైతులకు సొమ్ములు చెల్లించడం జరిగిందన్నారు.

4 లక్షల మె.ట. ధాన్యం కొనుగోలు లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. దీనికి అనుగుణంగా గోనె సంచులను అందుబాటులో ఉంచామన్నారు. రైతులకు మేలు జరుగుతుందనే ఆకాంక్షతో ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. గతంలో కొందరు వ్యక్తుల ఖాతాలకే ధాన్యం సొమ్ములు జమ అయ్యేవని, ప్రస్తుత ప్రభుత్వంలో నేరుగా రైతుల ఖాతాలకు సొమ్ములు జమ చేస్తున్నట్టు తెలిపారు. రవాణా ఛార్జీలను సైతం రైతు లేదా ట్రాన్స్‌పోర్టర్స్ ఖాతాకు జమ చేస్తున్నామన్నారు. ఏ ఒక్క రైతుకు అన్యాయం చేయకూడదనే ఉద్దేశంతో పర్యవేక్షణ యంత్రాంగం పనిచేస్తోందన్నారు. విక్రయించిన 21 రోజుల్లోనే రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లిస్తామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని లబ్ధి పొందాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీఎస్‌వో ఎస్.సరోజ, ఆర్డీవో చెన్నయ్య, సివిల్ సప్లయిస్ మేనేజర్ టి.శివరాంప్రసాద్, డీసీవో ఎం.రవికుమార్, సొసైటీస్ సబ్ డివిజనల్ అధికారి ఆర్.నరేంద్ర కుమార్, డీటీవో ఇన్‌ఛార్జ్ జి.సంజయ్‌కుమార్, ఎంవీఐ డీఎస్ఎస్.నాయక్, ఏడీఏ పి.మురళీకృష్ణ, తహసీల్దార్ జీవీ.శేషగిరిరావు, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కై కాల శ్రీనివాస్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలి

రైతులు సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలని, దీనిపై సీఎం వైఎస్ జగన్ సైతం దృష్టి సారించారని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. చిరు ధాన్యాల సాగులో ప్రపంచంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. పురుగు మందుల రహిత సాగు చేపట్టాలన్నారు. ప్రతి రైతు ఆర్‌బీకేల్లో ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలని కోరారు.

రీ సర్వేలో పొరపాట్లకు తావివ్వద్దు

- రీ సర్వే స్టీరింగ్ కమిటీ చైర్మన్ అజేయ కల్లం
- గూడెం మునిసిపాలిటీలో రీసర్వేపై అధికారులతో సమీక్ష



తాడేపల్లిగూడెంలో జగనన్న రీసర్వేపై సమీక్షిస్తున్న ఉన్నతాధికారులు

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష కార్యక్రమంలో సర్వేపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, యాజమాన్య ఆస్తి హక్కు ధ్రువ పత్రాల ప్రయోజనాలను వివరించాలని రీ సర్వే స్టీరింగ్ కమిటీ చైర్మన్ అజేయ కల్లం, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ స్పష్టం చేశారు. రీ సర్వేపై బుధవారం తాడేపల్లిగూడెంలో సంబంధిత అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పూర్తి అవగాహన కల్పించారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్స్ జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో భూసర్వేలో కచ్చితమైన నిబంధనలను పాటించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు కానివాటికి మాత్రమే భూహక్కు పత్రాలను జారీ చేయాలన్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం సర్వే నాటికి హక్కుదారులకు లేదా రిజిస్టర్ పత్రాలను సమర్పించిన వారికి భూహక్కు పత్రాలను జారీ చేయాలన్నారు. భూయజమానులకు తప్పక నోటీసులను ఇవ్వాలన్నారు. అందుబాటులో లేని గృహ యజమానులకు ఇంటికి నోటీసును అంటించి రికార్డు చేయాలన్నారు. ప్లానింగ్, డిజిటల్ రెవిన్యూ సెక్రటరీల సందేహాలకు సమాధానాలిచ్చారు. రీ సర్వే స్టీరింగ్ కమిటీ చైర్మన్ అజేయ కల్లాం మాట్లాడుతూ వందేళ్ల తర్వాత భూముల సమగ్ర సర్వే జరుగుతుందన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని జిల్లాలోని తాడేపల్లిగూడెంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించామన్నారు. భూహక్కు పత్రాలపై యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. రీ సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు భూహక్కు పత్రాలు అత్యంత ముఖ్యమైనవన్నారు. యజమాని రుణం పొందాలన్నా, క్రయవిక్రయాలు చేయాలన్నా భూహక్కు పత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. భవిష్యత్‌లో రిజిస్టర్ డాక్యుమెంట్లు మనుగడ తగ్గుతుందన్నారు. భూహక్కు పత్రం తప్పనిసరి అవుతుందన్నారు. కమిషనర్ డైరెక్టర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ బి.కోటేశ్వరరావు, ఏపీ రీసర్వే ప్రత్యేక అధికారి బి.సుబ్బారావు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.రామచంద్రారెడ్డి, ఆర్డీఓ కె.చెన్నయ్య, కమిషనర్ ఎ.శామ్యూల్, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహసీల్దార్ జీవీ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం



వీరవాసరం: జొన్నలపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్‌ను అందిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడి మృతి

ఏలూరు టౌన్: కొయ్యూరు రైల్వే గేటు సమీపంలో బుధవారం రైలు ఢీకొని ఒక గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మృతుడు వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని మృతుడి శరీరంపై నీలం రంగు పొడుగు చేతుల జీన్స్ షర్ట్, సిమెంట్ రంగు నిలువు చారల ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఏలూరు రైల్వే ఎస్సై నర్సింహరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సురక్ష శిబిరాల్లో టెలీ కన్సల్టేషన్ సేవలు

- డీఎంహెచ్ఓ ఉమామహేశ్వరరావు
- ఎస్.చిక్కాలలో సురక్ష శిబిరం తనిఖీ



శివదేవునిచిక్కాలలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ ఉమామహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: టెలీ కన్సల్టేషన్ ద్వారా ఆరోగ్య సలహాలు అందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో ఏర్పాట్లు చేసినట్లు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఉమామహేశ్వరరావు చెప్పారు. శివదేవునిచిక్కాలలోని జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రక్త పరీక్షలు, మందుల విభాగం, సాధారణ రోగులను పరీక్షించే తీరును ఆయన పరిశీలించారు. అలాగే అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులోకి వచ్చి ఆరోగ్య సలహాలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన టెలీ కన్సల్టేషన్ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నవంబర్ 15 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ జగనన్న ఆరోగ్య సురక్షా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ప్రతీ శిబిరంలో సుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు చేసి రూ.10 వేల నుంచి రూ.15 వేలు విలువైన మందులు అందిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరంలో రాగి జావ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ దిడ్ల మణి వజ్రం, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తదితరులున్నారు.

క్లుప్తంగా

26 నుంచి కార్గో మాసోత్సవాలు


మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సుబ్బారావు

తణుకు అర్బన్: కార్గో డోర్ డెలివరీ సదుపాయానికి ఆర్టీసీ సిబ్బంది సహకరించాలని జిల్లా అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కమర్షియల్ జి.లక్ష్మీప్రసన్న వెంకట సుబ్బారావు అన్నారు. ఈనెల 26 నుంచి వచ్చేనెల 25 వరకు నిర్వహించనున్న డోర్ డెలివరీ మాసోత్సవాలను ఉద్దేశించి బుధవారం తణుకు డిపోలో ఆఫీస్, గ్యారేజ్, డ్రైవర్స్, కండక్టర్స్, కార్గో సిబ్బందికి గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాసోత్సవాల్లో ప్రతి ఉద్యోగి కనీసం నాలుగు డోర్ డెలివరీలు చేయించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 87 ప్రాంతాల్లో 10 కిలోమీటర్ల పరిధిలో 50 కేజీల బరువు కలిగిన పార్సిల్స్‌కు డోర్ డెలివరీ సదుపాయం ఉందన్నారు. డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తన్నీరు పున్నయ్య, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్ పాల్గొన్నారు.

సహారా సంస్థ సిబ్బందికి న్యాయం చేయాలని వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సహారా సంస్థ యూనియన్ సభ్యులు

తణుకు టౌన్: సహారా ఇండియాలో పని చేస్తున్న స్టాఫ్ అండ్ వర్కర్స్‌కు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం తణుకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సహారా ఇండియాలో డైలీ ఏజెంట్లుగా పని చేసిన అనేక మంది యాజమాన్యం చేసిన తప్పులకు తాము నష్టపోయామని స్టాఫ్ అండ్ వర్కర్లు పేర్కొన్నారు. యాజమాన్యం భయంకరమైన తప్పులు చేసి వ్యాపార లావాదేవీలు ఆగిపోతే కొత్త వ్యాపారాలు ఎలా చేస్తారని పేర్కొన్నారు. దీనితో పాటు కొత్తగా సీఆర్‌సీ ద్వారా 45 రోజుల్లో విడతల వారీగా సొమ్ము చెల్లించే ఏర్పాట్లు చేస్తామని ఇచ్చిన హామీ కూడా ఇప్పటి వరకూ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహారా స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం మోహన్, ఎంవీఎస్ కుమార్, డీజే దుర్గారావు, కేఎస్ నాగరాజు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన సర్కారు


సమావేశంలో మాట్లాడుతున్న కామ్రేడ్ వి.శివదాసన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని కేరళ రాష్ట్ర సీపీఎం పార్టీ రాజ్యసభ సభ్యుడు కామ్రేడ్ వి.శివదాసన్ అన్నారు. సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కిరాణా వర్తక సంఘం భవనంలో పాలకులు, విధానాలు, ప్రత్యామ్నాయ రాజకీయాలు అనే అంశంపై సదస్సు జరిగింది. కర్రి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వి.శివదాసన్ మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారులకు, బడా కార్పొరేట్‌లకు రూ.14 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చారని విమర్శించారు. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశ లౌకికతత్వాన్ని దెబ్బతీస్తూ అట్టడుగు వర్గాలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం, కరెడ్ల రామకృష్ణ, బాపయ్యశర్మ, పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, కండెల్లి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

20న మండల సర్వసభ్య సమావేశం

ఇరగవరం: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 20 వ తేదిన ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

పాలకోడేరు: జిల్లాలో దివ్యాంగుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జీసీహెచ్ ప్రభాకర్ తెలిపారు. బుధవారం పాలకోడేరులో దివ్యాంగురాలైన మంతెన సూర్యకుమారికి టీవీఎస్ ట్రై మోటార్ సైకిల్‌ను ఆయన అందజేశారు. కార్యక్రమానికి హాజరైన తహసీల్దార్ షేక్ హుస్సేన్ మోటార్ సైకిల్ పత్రాలను అందజేశారు.

పేదలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

- అందుకే జగనన్న వైద్య శిబిరాలు
- ఉచితంగా రోగులకు మందుల పంపిణీ
- తాడేపల్లిగూడెం, తణుకు డివిజన్లలో పలుచోట్ల వైద్యసేవలు


తాడేపల్లిగూడెం రూరల్: కొమ్ముగూడెం జగనన్న ఆరోగ్య సురక్ష సభలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు


పెంటపాడు: సచివాలయం-2 వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ దాసరి హైమావతి

తాడేపల్లిగూడెం రూరల్: ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా పేదలు కూడా సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశ్యంతోనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కొమ్ముగూడెం తాడేపల్లి బేబి అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ 2004కు ముందు ఉన్నత స్థాయి వైద్యం చేయించుకోవలసి వస్తే ఆస్తులను అమ్ముకోవలసి వచ్చేదన్నారు. వైఎస్సార్ అధికారంలోకి రాగానే గుండె, ఉన్నత వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. సర్పంచ్ తాడేపల్లి బేబి మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రికి వెళితే రూ.500లు ఉంటేనే గాని ఓపీ చీటి రాసే పరిస్థితి లేదన్నారు. అటువంటిది ఇంటి వద్దనే ఉన్నతమైన వైద్యం అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం వైద్యులు జి.రూపాదేవి, ఎవి.వెంకటేష్, ఇ.శ్వేతశ్రీ, ఆర్.స్నేహిత, పి.కాంచనప్రియలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, పంచాయతీ ఏవో బి.ఫణికుమార్, సీహెచ్‌వోలు సీహెచ్. సందీప్‌రాజ్, పి.నవ్యలక్ష్మి, డి.ప్రవల్లిక, ఎస్.నీరజ, టి.సన్ని, కే.లక్ష్మీదుర్గ, బి.విజయలక్ష్మి, కే.నాగేశ్వరరావు, డి.సత్తిబాబు, రామకుమారి, కేవీ.రామోజీ, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, హెచ్ఎం జి.శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకుమారి, ద్వారకాతిరుమల ట్రస్ట్ బోర్డు మెంబర్ గంటి చినసర్వేశ్వరరావు, ఆశాలు, ఐసీడీఎస్, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఎంతో మేలు

పెంటపాడు: జగనన్న సురక్షతో పేద ప్రజలకు ఎంతో మేలని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం బుధవారం పెంటపాడు సచివాలయం-2 కనకసుందరావు కాలనీలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా మంచి వైద్యం అందుతోందన్నారు. సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్యసురక్ష ప్రతి పేదవాడికి మేలు జరుగుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇటువంటి కార్యక్రమాలకు రూపకల్పన చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, బర్ల జయరాంబాబు, తాడేపల్లి ఈశ్వరరావు, ప్రేమ్‌కుమార్, బందారు రాంబాబు, కొలుపూరి శివకిరణ్, గోకా వెంకటేశ్వరరావు, తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో సీహెచ్. బాలాజీ, పెంటపాడు, ముదునూరు వైద్యాధికారులు తోట రాజేష్, ఎస్వీ రమణ, పెంటపాడు కార్యదర్శి కేవీ రామారావు, ప్రత్యేక వైద్యులు విజయ్ కుమార్(ఆర్థో), అహ్మద్ ఉన్నీసాబేగం (గైనకాలజీ), కంటి డాక్టర్ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం రూరల్: బీపీ పరీక్షలు చేస్తున్న దృశ్యం

వైద్యులు వచ్చిన రోగులకు పలు రకాల వైద్యపరీక్షలు చేసారు. నేత్రశిభిరంలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్యసురక్ష ద్వారా మెరుగైన వైద్యసేవలు

అత్తిలి: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి, వారికి సకాలంలో మంచి ఆసుపత్రుల్లో చికిత్సలు అందించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈవైద్య శిబిరంలో ఏడురకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని, మెరుగైన చికిత్స అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారని చెప్పారు. వైద్య శిబిరానికి 1807 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ప్రజా ప్రతినిధులు సందర్శించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కల్గిన ఆహారాన్ని ఎలా తయారు చేయవచ్చో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, మండల బీసీసెల్ అధ్యక్షుడు రంభ సూరిబాబు, పార్టీనాయకులు సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, గొలుగూరి శ్రీరామారెడ్డి, దొమ్మేటి శ్రీను, ఎమ్మెల్యో వెలగల విజయభాస్కరరెడ్డి, మండల ప్రత్యేక అధికారి కె మురళీకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీఓ ప్రమోదిని, సూపర్‌వైజర్ టి మహాలక్ష్మి, వైద్యులు ఆర్ జ్యోతికృష్ణ, ఎల్ చాముండేశ్వరి, పి కిరణ్, కె నాగరాజు, కెఎస్‌కే రామారెడ్డి, సెక్రటరీ కె శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ వద్ద పోటెత్తిన ప్రజలు


అత్తిలి: జగనన్న సురక్ష శిబిరంలో పేర్లను నమోదు చేసుకుంటున్న ప్రజలు


అత్తిలి: ఆరవల్లిలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరంలో రోగులకు మందులను అందజేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


అత్తిలి మండలం ఆరవల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీఓ ప్రమోదిని

అత్తిలి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ప్రమోదిని అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో బుధవారం ఆమె అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో పీపీ1, పీపీ2 ద్వారా శిక్షణ ఇస్తున్నామన్నారు. పోషక ఆహార విలువలతో కూడిన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులకు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, వివిఎల్ఎన్ కుమారి, ఎస్ విజయ, కె వరలక్ష్మి,సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి


పలు అంశాలను అవగాహన కల్పిస్తున్న హైదరాబాద్‌కు చెందిన కేవీ సత్యప్రకాశ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా సెలవులు సందర్భంగా ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో బుధవారం హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు విశ్రాంత ఉద్యోగి బాపయ్య శర్మ, హైదరాబాద్‌కు చెందిన కేవీ సత్యప్రకాశ్‌లు స్పోకెన్ ఇంగ్లీషు, పుస్తకాలు చదవడం, జనరల్ నాలెడ్జి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. బాపయ్య శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువును ఇష్టంతో చదవాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, చదవరులు పాల్గొన్నారు.

అమ్మ అలంకారం.. భక్తులకు అపురూపం


టీపీసీ, టీఓసీ : మహాలక్ష్మీదేవిగా బలుసులమ్మ అమ్మవారు

దుర్గాదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల నాలుగవ రోజు అమ్మవారు మహలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వాడవాడలా అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి, ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు, యువత మాలదారణ చేసి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. జై.దుర్గ, జైజై దుర్గ అంటూ భక్తులు నినదించగా..గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈనెల 24తో ఉత్సవాలు ముగియనున్నాయి.

- తణుకు అర్బన్, తణుకు టౌన్, అత్తిలి, తాడేపల్లిగూడెం రూరల్, తాడేపల్లిగూడెం (టీఓసీ), పెంటపాడు


తాడేపల్లిగూడెం రూరల్ : మహలక్ష్మిదేవి ముత్యాలాంబపురం శ్రీముత్యాలమ్మ


తణుకు టౌన్: మహాలక్ష్మి దేవి అలంకరణలో మండపాక యల్లారమ్మ


తణుకు అర్బన్ మహలక్ష్మీ అవతారంలో శ్రీకామాక్షి దేవి


పెంటపాడు : రావిపాడు ముళ్లమ్మ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ


అత్తిలి: శ్రీమహాలక్ష్మిదేవి అలంకరణలో శ్రీకనకదుర్గమ్మ

ఆర్డీఓ భవన ప్రాంగణం పరిశీలన


ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు, కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెంలోని ఆర్అండ్‌బీ బంగ్లా ప్రాంగణంలో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించిన భవనాన్ని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం పరిశీలించారు. భవనానికి సంబంధించి మార్పులు చేర్పులపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఆర్డీఓ కె.చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ పి.శామ్యూల్ వారితో ఉన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

భీమవరం అర్బన్: క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శరీర ధారుడ్యం పెంపొందుతుందని సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు బద్దా శాంతారామ్ అన్నారు. భీమవరం మండలం యనమదుర్రు గ్రామంలో బుధవారం సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి అంబేద్కర్ యూత్ ఆధ్వర్యాన ఐదు రోజుల పాటు జరిగే జిల్లా స్థాయి చెడుగుడు పోటీలను వారు ప్రారంభించారు. ప్రాచీన సాంప్రదాయ క్రీడ చెడుగుడు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయవచ్చన్నారు. కార్యక్రమంలో ఉన్న మట్ల సామ్యేల్ రాజు, బద్దా రవికుమార్, పాలపర్తి జక్రయ్య, దేవాబత్తుల డేవిడ్ స్పర్జన్, కొయ్యే ప్రవీణ్, యాకోబు, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

IV
సాక్షి
ఫ్యామిలీ
తాడేపల్లిగూడెం
గురువారం ॥ 19-10-2023







● ఒకనాటి దసరా
లేదయా మీ దయా మా మీద లేదు

దసరా అంటే సెలవులు.
దసరా అంటే అయ్యవార్లతో పిల్లలు కలిసి వెళ్లి పాడే పాటలు.
దసరా అంటే పగటి వేషాలు. దసరా అంటే బతుకమ్మలు.
దసరా అంటే బొమ్మల కొలువులు.
దసరా అంటే ఊళ్ల నుంచి విచ్చేసే బంధువులు.
జేబు నుంచి తీసి ఇవ్వాల్సిన ఆత్మీయ మామూళ్లు.
దసరా అంటే స్త్రీ, పురుషులకు ఉల్లాసం.
పిల్లలకు ఆటవిడుపు. కాలం చాలా మారింది. నాటి దసరా ఎలా ఉంటుందో
నేటి తరాలకు పదే పదే చెప్పాల్సిన అవసరం ఏర్పడింది.
పెద్దలకు గుర్తు చేయాల్సిన బాధ్యత కూడా.

‘ఏ దయా మీ దయా మా మీద లేదు ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు
పావలా అర్ధయితే పట్టేది లేదు ముప్పావలా అయితే ముట్టేది లేదు
హెచ్చు రూపాయయితే పుచ్చుకుంటాము
అయ్యవారికి చాలు ఐదు వరహాలు పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు’...

ఒకప్పుడు దసరా వస్తే పిల్ల దండును వెంట బెట్టుకుని అయ్యవార్లు బయలుదేరేవారు. ఇంటింటికి తిరిగేవారు. మామూళ్లు స్వీకరించేవారు. ఆ రోజుల్లో ఊళ్లలో బడి కొత్త. చదువు కొత్త. అయ్యవార్లకు జీతాలు అంతంత మాత్రం. సంవత్సరంలో నేర్పిన విద్య దసరా సెలవుల్లో పెద్దల ముందు అయ్యవార్లు పిల్లల చేత ప్రదర్శింపచేసేవారు. పిల్లల తెలివితేటలు చూసి పెద్దలు ముచ్చట పడేవారు. బడికి చందాలు, అయ్యవార్లకు మామూళ్లు ఇచ్చేవారు. ఆ సమయంలో ఇలా పైన రాసిన పాట పాడేవారు. ఇంతకీ వరహా అంటే మూడున్నర రూపాయి.

దసరా కోసం పిల్లలు ఎదురు చూసేవారు. ఆ సమయంలో పిల్లల్ని బంధువుల వద్దకు పంపుతామనే హామీ ఉండేది. అవ్వా, తాతల దగ్గరికో, బాబాయి దగ్గరికో, మేనత్త ఊరికో నాలుగు జతలు పెట్టుకుని పిల్లలు ఉత్సాహంగా వెళ్లేవారు. దసరా సెలవులు హాయిగా గడిపేవారు.

దసరా వేషాలు

దసరాలో పిల్లలకు, పెద్దలకు ఆసక్తి దసరా వేషాలు. చాలా మంది కళాకారులు పురాణ వేషాలు కట్టి ఇళ్ల ముందుకు వచ్చి కానుకలు స్వీకరించేవారు. పిల్లలకు ఈ వేషాలు చూడటం మహా సరదా. సీతారాములు, హనుమంతుడు, నారదుడు, శివుడు, అర్ధ నారీశ్వరుడు... ఇక పులి వేషాలు తప్పనిసరి. ఆ రోజుల్లో పులిని చూడటం అరుదు కాబట్టి (సినిమాల్లో తప్ప) మనిషే పులి రూపు కట్టి ఎదురు పడితే అబ్బురపడేవారు. తప్పెట్ల మోతకు వేషగాళ్లు లయబద్ధంగా ఆడుతుంటే నోరు తెరిచి చూసేవారు. నేలన పడేసిన రూపాయి కాసునో నిమ్మకాయనో పులి వేషగాడు నోట కరవడం ఒక ఘట్టం. దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతాయి కదా. అలా ఎవరైనా ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటే ‘దసరా బుల్లోడు’ అనడం ఆనవాయితీ.

బొమ్మల కొలువులు

ఇక బొమ్మల కొలువు పెట్టి ఆనందించడం ఆడపిల్లల వంతు. బొమ్మల కొలువును ఎప్పుడూ బేసి సంఖ్య మెట్ల మీద ఏర్పాటు చేస్తారు. ఇంటి ఆచారాన్ని బట్టి ఇంటి ఆడపిల్ల చేత పార్వతీ పరమేశ్వరులను గాని, సీతారాములను గాని, రాధాకృష్ణులను గాని, లక్ష్మీ సరస్వతులను గాని పెట్టిస్తారు. అమ్మాయి మొదటి దేవతా మూర్తిని పెట్టాక, ఆ యేడు కొన్న కొత్త బొమ్మను తల్లి కూడా పట్టుకుని పెట్టిస్తుంది. ప్రతి ఏడు ఒక కొత్త బొమ్మ తప్పనిసరిగా కొనడం ఆచారం. ఈ క్రమం లోనే, కొండపల్లి బొమ్మలు, నక్కపల్లి బొమ్మలతో పాటు దేశదేశాల బొమ్మలు సేకరించి బొమ్మల కొలువులో పెట్టడం వ్యాప్తి లోకి వచ్చింది. అందంగా, కళాత్మకంగా అమర్చిన బొమ్మల కొలువు పేరంటానికి బంధు మిత్రులను పిలిచి తొమ్మిది రోజులూ పేరంటం చేస్తారు. పేరంటానికి పిల్లలూ పెద్దలూ కూడా వస్తారు. బొమ్మలకు హారతి ఇచ్చి ప్రసాదం పంచిపెడతారు.

బతుకమ్మ

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమయిన పండగ బతుకమ్మ. బతుకమ్మ పండగ వస్తూందంటే తెలంగాణా పల్లెల్లో నూతన ఉత్సాహం వెల్లివిరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్రపరుస్తారు. చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా పుట్టింటికి వెళ్లడం కోసం ఎదురు చూస్తుంటుంది. రంగు రంగుల పూలతో త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ బతుకమ్మలను నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు మేళవిస్తారు. ఈ పాటలు చాలా వినసొంపుగా ఉంటాయి.



పటాలు, విగ్రహాలు





సంతృప్తికరమైన సేవ

ఆలయంలో అయినా, ఇంట్లో అయినా పూజను ఎంతో భక్తి శ్రద్ధలతో నిష్ఠగా చేస్తాం. ఇంట్లో ఉండే దేవతా మూర్తుల విగ్రహాలు, పటాలు, ఫొటో ఫ్రేములు జారిపడినా, పక్కకు ఒరిగిపోయినా అపశకునంగా భావిస్తారు. అందుకే మరింత శ్రద్ధగా పూజ చేయడంతోపాటు, పూజాసామగ్రిని ఎంతో జాగ్రత్తగా భద్రపరుస్తుంటారు. అయినప్పటికీ కొన్నిసార్లు విగ్రహాలు పాతబడి విరిగి పోవడం, ఫొటో ఫ్రేములు చిరిగిపోవడం లేదా తుప్పు పట్టి పాడైపోవడం జరుగుతుంటుంది. అలాంటి వాటిని వెంటనే తీసేసి కొత్తవాటిని పూజలో పెట్టుకుంటారు. మనలో చాలామంది ఇలానే పడేస్తుంటాము. తృప్తి గైక్వాడ్ మాత్రం ఈ విగ్రహాలను పడేయకుండా.. రీ సైకిల్ చేసి రకరకాల వస్తువులను తయారు చేస్తోంది. చెత్తగా మారకుండా... సరికొత్త హంగులు అద్ది అందంగా మారుస్తోంది.



మహారాష్ట్రలోని యోవలాలో పుట్టి పెరిగిన తృప్తి గైక్వాడ్ వృత్తిపరంగా నాసిక్‌లో స్థిరపడింది. న్యాయవాదిగా క్షణం తీరికలేని పని తనది. అయితే తన చుట్టూ ఉన్న సమాజంలో జరిగే విషయాలను ఎంతో ఆసక్తిగా గమనించే మనస్తత్వం కావడం వల్ల 2019లో ఓసారామె గంగానదిని చూడడానికి వెళ్లింది. అప్పుడు గంగానదిని వరదలు ముంచెత్తుతున్నాయి. ఇదే సమయంలో ... విరిగి పోయిన దేవతా మూర్తుల విగ్రహాలు, ఫ్రేములు తీసుకుని నదిలో వేయడానికి వచ్చాడు ఒకతను. అతన్ని చూసిన తృప్తి..‘‘వీటిని నదిలో వేయకు. వీటిలో ఉన్న పేపర్, కార్డ్‌బోర్డ్, మట్టిబొమ్మలు నదిని మరింత కలుషితం చేస్తాయి’’ అని చెప్పి అతను వాటిని నదిలో వేయకుండా వారించింది. అందుకు ఆ వ్యక్తి ఇక్కడ వేయవద్దు.. మరి వీటిని ఏం చేయాలి?’’ అంటూ చికాకు పడ్డాడు. అప్పటికేదో సమాధానం చెప్పి అతణ్ణి పంపింది కానీ తృప్తి మనసులో కూడా ‘అవును వీటిని ఏం చేయాలి?’ అన్న ఆలోచన మొదలైంది. కొద్దిరోజులు తర్వాత వీటిని రీ సైకిలింగ్ చేసి ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్న ఆలోచన తట్టింది తనకు. తన ఐడియాను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగుతో పంచుకుంది. అంతా ప్రోత్సహించేసరికి .. పాత దేవతామూర్తుల విగ్రహాలు రీసైకిల్ చేయడం ప్రారంభించింది.

“దేవతల విగ్రహాల ఫొటోఫ్రేములను చక్కగా అలంకరించి నిష్ఠగా పూజిస్తారు. ఇటువంటి ఫ్రేములు పాడైతే పడేయాల్సిందే. ఇది నచ్చకే సంపూర్ణమ్‌ను తీసుకొచ్చాను. దేవుడి విగ్రహాలను శాస్త్రోక్తంగా నిమజ్జనం చేసిన తరువాతే రీసైక్లింగ్ చేస్తున్నాను. వాట్సాప్, ఫేస్‌బుక్‌ల చాలా మంది కస్టమర్లు నన్ను సంప్రదిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటిదాకా వేల సంఖ్యలో రీసైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాను. అదేవిధంగా దేవుడి పటాలకు మంచి రూపాన్ని ఇవ్వడం ఎంతో తృప్తినిస్తోంది”.
– తృప్తి గైక్వాడ్

సంపూర్తిగా...

విగ్రహాలను రీసైక్లింగ్ చేసేందుకు ‘సంపూర్ణమ్’ పేరిట స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. సంపూర్ణమ్ టీమ్ దేవతామూర్తుల పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేములను గుళ్లు, చెట్లకింద పడి ఉన్న వాటిని, ఇళ్లనుంచి సేకరిస్తుంది. ఈ విగ్రహాలను పూర్తిగా పొడిచేసి మొక్కలకు ఎరువులా మారుస్తారు. ఎరువుగా పనికిరాని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన మట్టిని కుండలు, పాత్రలు, ఇటుక రాళ్లుగా తయారు చేస్తారు. వీటితో పక్షులు, జంతువులకు గూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా తయారైన పాత్రల్లో పక్షులు, జంతువులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్నారు.



సంపూర్ణమ్ సేవలను మహారాష్ట్రలోని పూనే, నాసిక్, ముంబై, సోలాపూర్, సంగమ్నేర్‌లకు విస్తరించింది తృప్తి. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో సైతం సేవలను ప్రారంభించింది. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ద్వారా ఈ రీసైక్లింగ్ గురించి అవగాహన కల్పిస్తోంది.

ఆకర్షణీయమైన టాయిస్..

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కలిసిన విగ్రహాలను పొడిగా మార్చి, ఈ పొడికి కొద్దిగా సిమెంట్‌ను కలిపి టాయిస్‌ను రూపొందిస్తున్నారు. మురికివాడల్లోని నిరుపేద పిల్లల ద్వారా పాతవిగ్రహాలు, ఫొటోఫ్రేమ్‌లనూ సేకరిస్తూ వారికి ఆర్థికంగా సాయపడుతోంది.

న్యూస్ మేకర్

కల్లోల ఇజ్రాయెల్‌లో ఇండియన్ సూపర్ ఉమెన్



బతికి ఉంటే బలుసాకు తిని బతకవచ్చు... అనుకునే భయానక పరిస్థితుల్లో ఉండి కూడా, తమకు ఏమైనా ఫరవాలేదు, నిస్సహాయులైన వృద్ధదంపతులకు ఏమీ కాకూడదని వారిని కంటికి రెప్పలా కాపాడారు ఇజ్రాయెల్‌లో హోమ్ నర్స్‌లుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌లు...

దక్షిణ ఇజ్రాయెల్...

గాజా సరిహద్దుకు రెండో కిలోమీటర్‌ల దూరంలో ఉన్న నిర్ ఓజ్ కిబ్బట్జ్ పట్టణంలో ఒక ఇంట్లో...

85 సంవత్సరాల షాలిక్, 76 సంవత్సరాల రహెల్ దంపతులకు నలుగురు పిల్లలు. పిల్లలు వేరు వేరు ప్రాంతాలలో ఉంటున్నారు. రహెల్ అనారోగ్యంతో బాధ పడుతోంది. ఆమెను చూసుకోవడానికి ఆరోజు ఆ ఇంట్లో సబిత, మీరా మోహన్ అనే ఇద్దరు హోమ్‌నర్స్‌లు ఉన్నారు.

ఉదయం ఆరున్నర ప్రాంతంలో సైరన్ మోత వినిపించింది. ప్రజలు బాంబ్ షెల్టర్‌లలో తల దాచుకోవాలని చెప్పే సైరన్ అది.

‘ఆ ఉదయం సైరన్ మోగేసరికి గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. సెకండ్ల వ్యవధిలో సేఫ్టీరూమ్‌లోకి వెళ్లాలి. ఇంతలో రహెల్ కుమార్తె నుంచి ఫోన్ వచ్చింది. బయట పరిస్థితి భయానకంగా ఉంది అని ఆమె చెప్పింది. మాకు ఏం చేయాలో తోచలేదు. ఇంటి ముందు, వెనుక తలుపులకు తాళాలు వేసి అమ్మానాన్నలను తీసుకొని, పాస్‌పోర్ట్, డైపర్‌లు, యూరిన్ పాట్, మందులతో సెక్యూర్ రూమ్‌లోకి వెళ్లాలని ఆమె చెప్పింది. షాలిక్, అనారోగ్యంతో ఉన్న రహెల్‌ను నడిపించుకుంటూ షెల్టర్ రూమ్‌లోకి వెళ్లాం. ఈలోపే మిలిటెంట్‌లు ఇంట్లోకి ప్రవేశించారు. అద్దాలు బద్దలు కొట్టారు. వస్తువులు ధ్వంసం చేశారు. షెల్టర్‌రూమ్‌పై కాల్పులు జరుపుతున్నారు. ఐరన్ డోర్ వెనకే మా శరీరాలను గట్టిగా ఆనించి ఎన్నో గంటలపాటు నిల్చున్నాం. అదృష్టవశాత్తు ఐరన్ డోర్ ధ్వంసం కాలేదు. ధ్వంసం అయి ఉంటే ఎవరి ప్రాణాలు మిగిలేవి కావు’ అంటూ ఆ భయానక ఘటనను గుర్తు తెచ్చుకుంది 39 సంవత్సరాల సబిత.



● మీరా మోహన్, సబిత

కేరళకు చెందిన సబిత, మీరా మోహన్‌ల సాహసం, మానవత్వం గురించి ఢిల్లీలోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం ‘ఇండియన్ సూపర్ ఉమెన్’ అంటూ ప్రశంసించింది.

టిప్స్



● రెండు కర్పూరం బిళ్లలు, మూడు కప్పుల వేపాకుల్లో కొద్దిగా కొబ్బరి నూనె వేసి పేస్టుచేయాలి. ఈ మిశ్రమాన్ని చుండ్రు ఉన్న ప్రాంతంలో రాసి మర్దన చేయాలి. చుండ్రు బాధ క్రమంగా తగ్గిపోతుంది. కర్పూరం పొడిని ఆలివ్ నూనెలో వేసి కలిపి జుట్టుకు పట్టించినా చుండ్రు తగ్గుతుంది.

ఈ రెండింటిలో ఏదైనా ఒకటి వారానికి మూడుసార్లు చేస్తే ఉపశమనం త్వరగా వస్తుంది.

● కాలివేళ్ల సందుల్లో గాలి తగలక పాచిపడుతుంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే...కాళ్లను శుభ్రంగా కడిగి, తడిలేకుండా తుడవాలి. ఇప్పుడు టూత్‌పేస్టుని వేళ్ల సందులో రాయాలి. రోజూ పడుకునేముందు ఇలా చేస్తే కాళ్లు పాయవు.



హాబీతో వయసును ఓడించాను



రవి బాల శర్మ

సాధారణంగా 65 ఏళ్ల వయసులో మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పి అంటూ బాధ పడేవారిని చూస్తుంటాం. కానీ, రవి బాల శర్మ బాలీవుడ్ తారలకు దీటుగా డ్యాన్సులు చేస్తూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తున్నారు. ఆమె అసలు పేరుకన్నా ‘డాన్సింగ్ దాదీ’గా ఫేమస్ అయ్యింది. మహిళలే కాదు యువత కూడా ఆమె డ్యాన్స్ స్టెప్పులకు ఆశ్చర్యపోతూ ఫాలో అవుతున్నారు. ఈ వయసులో పూజలు చేసుకోకుండా డ్యాన్సులు ఏంటి అనేవారికి మీలో స్కిల్స్ లేకనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఘాటుగా సమాధానం చెబుతుంది. ఇంతకీ ఎవరీ రవి బాల శర్మ...

‘‘నా పేరు ముందు రవి అని అబ్బాయిల పేరు ఉంటుంది. మా చెల్లి పేరు శశి ప్రభ శర్మ అంటే చంద్రుడు. నా పేరులో సూర్యుడు ఉండాలని రవి అని నాన్న అనుకున్నారట. అందుకే బాల అనే నా పేరు ముందు రవి చేర్చారు. చాలా మంది నా పూర్తి పేరు తెలుసుకోకుండా మిస్టర్ అని సంబోధిస్తుంటారు. నేను స్కూల్ టీచర్‌గా చేసే రోజుల్లో ప్రమోషన్ జాబితాలో నా పేరు కనిపించలేదు. విషయమేంటని ఆరా తీస్తే మగ టీచర్ల జాబితాల్లో నా పేరు ఉందని తెలిసింది.

సంగీత వారసత్వం

ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో పుట్టి పెరిగాను. మా ఇంట్లో ఎప్పుడూ సంగీత వాతావరణం ఉంటుంది. మా నాన్న సంగీత ఉపాధ్యాయుడు. అనేక వాద్యాలను వాయించేవాడు. ఆయన దగ్గరే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాను. మా అమ్మ కూడా చాలా బాగా పాడేది. కానీ, పిల్లల పెంపకంలో ఆమె ఎప్పుడూ బిజీగా ఉండేది. మా నాన్న కొడుకు, కూతురు అనే తేడా చూడలేదు. నా కూతుళ్లు తమ కాళ్లపై తాము నిలబడగానే పెళ్లి చేస్తానని చెబుతుండేవాడు. దీంతో ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం రాలేదు. పాడటమే కాకుండా కథక్ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకున్నాను. సితార్, తబలా కూడా వాయిస్తాను. హిందీలో మాస్టర్స్ డిగ్రీ తీసుకున్నాను. 27 ఏళ్లుగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా ఉన్నాను. పెళ్లయ్యాక ఇల్లు, పిల్లలు, స్కూలు బాధ్యతలతో బిజీ అయిపోయాను. నా ఆసక్తుల గురించి పట్టించుకోలేదు. స్కూల్లో పిల్లలకు సంగీతం నేర్పించడంలో ఎంతో సంతృప్తి ఉండేది. కానీ, సంగీతం టీచర్లకు మిగతా టీచర్లకు ఉన్నంత ప్రాధాన్యత ఉండేది కాదు.







కొడుకుతో కలిసి..

నా భర్తకు కేన్సర్ అని తెలియగానే కుప్పకూలిపోయాం. అతని మరణం నన్ను బాగా కుంగదీసింది. కూతురికి పెళ్లయ్యింది. మా అబ్బాయి ఏకాంష్ రచయిత, నటుడు. దీంతో అతనితో పాటు ముంబై వచ్చాను. లాక్డౌన్ సమయంలో మా అబ్బాయి సోషల్ మీడియా అకౌంట్‌ను క్రియేట్ చేశాడు. నన్ను విషాదం నుంచి తేరుకునేలా చేసేందుకు కొన్ని వీడియోలు షూట్ చేసేవాడు. ఆ తర్వాత వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించాడు. వాటిని చూసి, వస్తున్న ప్రశంసలు చూసి నేనూ చాలా ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. మొదట్లో పెద్దగా వ్యూస్ రాకపోయినా తర్వాత ఫేమస్ అయ్యాను.

వైరల్ అయిన విధం..

గాయకుడు, గేయ రచయిత దిల్జీత్ దోసాంజ్ పాటకు డ్యాన్స్ చేసి, ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే, ఆ వీడియోను అతను షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. నా డ్యాన్స్ టాలెంట్ నన్ను సోషల్ మీడియాకు ‘డ్యాన్స్ దాది’ని చేసింది. లక్షలాది మంది అభిమానులను తెచ్చిపెట్టింది.

బాలీవుడ్ తారలు

ఏ నటి పాటతో డ్యాన్స్ చేసినా ఆమె నా వీడియోను షేర్ చేసేంతగా పేరు రావడం నిజంగా ఆశ్చర్యమనిపించింది. ఈ వయస్సులో డ్యాన్స్ చేయడం చూసి వాళ్లూ ఆశ్చర్యపోతుంటారు. కానీ నా వయస్సును హాబీకి దూరంగా ఉంచుతున్నాను. నృత్యం నా హాబీ. అది నన్ను నా మనసులో ఎప్పుడూ యవ్వనంగా ఉంచుతుంది. నా డ్యాన్స్ వీడియోలు చూసిన తర్వాత చాలామంది మహిళలు ‘మీ నుంచి చాలా స్ఫూర్తి పొందుతున్నామ’ని చెబుతుంటారు. చాలా మంది యువకులు కూడా నా డ్యాన్స్ ఫాలో అవుతున్నారు. కొందరు మాత్రం ‘ఈ వయసులో పూజలు చేసుకోకుండా, డ్యాన్స్ ఎందుకు, నడుం పట్టేస్తుంది జాగ్రత్త’ అని కామెంట్స్ చేస్తుంటారు. అలాంటి వారికి నేను భయపడను. వారికి డ్యాన్స్‌లో స్కిల్ లేదు. కాబట్టి, వారికి ఆ కళ తెలియదు. విమర్శించేవారు వారి వ్యక్తిగత చిరాకుల కారణంగానే అలాంటి కామెంట్స్ చేస్తారు అనిపిస్తుంది. కొందరికి ఇష్టం ఉన్నా తమలో ఉన్న బిడియం వల్ల డ్యాన్స్ చేయలేరు. ఇంకొందరు తమకు నచ్చినది ఇతరులు చేయడం చూస్తే ‘నేనెందుకు చేయలేకపోయాను’ అని బాధపడతారు. ఇది ఒకరకమైన మానసిక రుగ్మత తప్ప మరొకటి కాదు. అలాంటి వారిపై మన శక్తిని వృథా చేయకూడదు. ఎందుకంటే అది మనల్ని ముందుకెళ్లకుండా ఆపుతుంది.





వయసు ఓ సంఖ్య మాత్రమే!

హృదయంలో పిల్లల్లాగే ఉండి, హాబీస్‌తో జీవిస్తున్నట్లయితే మిమ్మల్ని ముందుకు వెళ్లకుండా ఎవ్వరూ ఆపలేరు. అదే, ఎన్నో విషాదాలను వెనక్కి నెట్టేస్తుంది. మీ హాబీ మిమ్మల్ని యంగ్‌గా ఉండటానికి సహాయపడుతుంది. ఇలాంటప్పుడు వయసు తన ప్రభావాన్ని చూపడంలో ఎప్పుడూ ఫెయిల్ అవుతుంది. నేను డాన్స్ చేయకపోతే వయసు నన్ను ఓడించేది. కానీ, నా హాబీని సజీవంగా ఉంచుకుని, దానిని పూర్తి స్థాయిలో జీవించడం ద్వారా వయసును ఓడించాను’’ అని ఆనందంగా తెలియజేస్తారు ఈ డ్యాన్సర్.